# మనదృష్టి యెట్టిదో సృష్టి అట్టిది

**సూక్ష్మమైనట్టి మనసున సూక్ష్మమగుచు**
**మేటి వస్తువునందున మేటి అగుచు**
**అంతటను సర్వసాక్షియై అలరునట్టి**
**ఆత్మయే మనిషి మనిషియే ఆత్మయగును**

ప్రేమస్వరూపులారా!

దైవం మానుషరూపేణ. జంతూనాం నరజన్మ దుర్లభం. ఈ మానవత్వమునకు యింతటి ప్రశస్తి, యింతటి విశిష్టత యేర్పడుటకు కారణమేమిటి? దైవం మానుషరూపేణ. దైవమే మనుష్యాకారమును ధరించి, వరించి, తరింపజేసే నిమిత్తమై యీ జగత్తునందు ఆవిర్భవించింది.

**స్థూల శరీరమే మానవరూపము కాదు**

కేవలము స్థూలరూపమే మానవుడని భావించరాదు. లోపలనున్న సూక్ష్మశరీరమైన మనస్సును కప్పిన కవచము వంటిది, యీ స్థూల శరీరము. ఈ స్థూల శరీరము, సూక్ష్మశరీరము రెండింటిని అధిగమించిన ఒక కారణ శరీరముకూడను వున్నది. ఈ కారణ శరీరమునుకూడను అధిగమించిన మహాకారణ శరీరముకూడను వున్నది. యీ చతుష్టయ సమ్మిళితమైన స్వరూపమే మానవుడు. ఇట్టి సత్యమును గుర్తించుకొనలేక మానవుడు పాంచభౌతికమైన యీ స్థూల శరీరము సత్యమని, నిత్యమని భావించి దానిని నిలబెట్టుకొనే నిమిత్తమై అనేక శ్రమలకు గురియగుచున్నాడు. నలుగురు అంధులు గజాకారమును గ్రహించగోరి ఒకరు గజముయొక్క కడుపును స్పృశించి గజమనగా ఒక గోడయని నిర్ణయము చేసుకున్నాడు. మరొకడు యీ గజముయొక్క కర్ణములు స్పృశించి గజమనగా కేవలము ఒక చేటవంటిది అని విశ్వసించాడు. మూడవవాడు తనయొక్క కాలు స్పృశించి, ఒక స్తంభము వంటిది యీ గజము అని నిర్ణయము చేసుకున్నాడు. నాల్గవవాడు యీ

sri sathyasai vachanamrutam

గజముయొక్క తోకను బట్టి చూచి కేవలము చీపురు వంటిది, యీ గజము అనుకున్నాడు. అదే విధముగనే మానవుడు తొంబై తొమ్మిది భాగములు దేహమునే మనిషిగా విశ్వసించి, యీ దేహాకారమును, మనుష్యాకారముగా భావించి తనయొక్క సత్యస్వరూపాన్ని విస్మరిస్తూ వస్తున్నాడు. వీరు కేవలము జ్ఞానాంధులనే చెప్పవచ్చును.

**నిత్యసత్యమైన ఆత్మ తత్త్వమే పూర్ణ మానవత్వము**

మరికొంతమంది మనిషి అనగా మనసే కనుక యీ సూక్ష్మమైన సంకల్ప వికల్పకాత్మకమైన మనసుయొక్క ఆకారమే మనిషి అని విశ్వసిస్తూ వచ్చారు. కొద్దిమంది మాత్రమే అంతఃకరణతత్త్వమును గుర్తించి వాసనాస్వరూపమైన యీ కారణ దేహమే మానవుడని తలుస్తూ వచ్చారు. ఏ కోటికొక్కరో నిజముగా ఆత్మస్వరూపమైన మహాకారణ తత్త్వమే మనుష్యుడు అనే సత్యాన్ని గుర్తిస్తూ వచ్చారు. విజ్ఞాన దృష్టితో పరిశీలన చేసి పైన కప్పబడిన యీ మూడు దేహములు వదలిపెట్టి మహాకారణమైన ఆత్మ తత్త్వమును ఎవరు గుర్తించునో వాడే ధన్యుడు. కనుక, స్థూలదేహమైన యీ పాంచభౌతిక దేహము కేవలము ఒక తొడుగువంటిది మాత్రమే! ఇది దేహములో నాల్గవ భాగమువంటిది. సర్వజ్ఞత్వమైన, సర్వశక్తిమయమైన, సర్వవ్యాపకమైన మనస్సుయొక్క తత్త్వము సంకల్పములతోకూడటంచేత యిది అర్ధదేహము వంటిది మాత్రమే! వాసనాస్వరూపమైన అంతఃకరణతత్త్వము మూడవభాగమువంటిది. నిత్యసత్యమైన ఆత్మతత్త్వమే పూర్ణమైన మానవత్వముతో కూడినది. దీనినే పురుషసూక్తము "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్" అని వర్ణించింది. అనగా వేయి శిరస్సులు కలిగినది, వేయి నేత్రములతో కూడినది, వేయి పాదములతో కూడినది. ఏతావాతా అన్ని పాదములు, అన్ని శీర్షములు, అన్ని నేత్రములుకూడను పరమాత్మునియొక్క ప్రతిబింబములే, అని స్పష్టము గావించింది.

**మనస్సు విక్షేపము, లయము అనే రెండు తత్త్వములతో కూడి వుంటున్నది**

'భక్తి వశః పురః', అనగా భక్తికి వశమైనదే యీ పురమనే దేహము. ఈ మధ్యనున్న మనస్సుయొక్క తత్త్వము మనము ప్రధానముగా గుర్తించవలసిన విషయము. మనస్సనగా మధ్యమ ఉద్యోగము వంటిది. ఇతను ప్రమోషనుతో పైకి పోగలడు. ఉన్నత స్థాయికి



srisathyasaivachanamrutam

పోగలడు. అదే విధంగా కొన్ని దోషములద్వారా reversion అనగా తక్కువ స్థాయికికూడ పోగలడు. యీ మనస్సు వున్నతస్థాయికి చేరవలెనన్నను, అధోస్థాయికి దిగజారవలెనన్నను సంకల్పవికల్పములే కారణములు. కనుకనే 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. మనస్సుకు రెండు విధములైన తత్త్వములున్నవి. ఇవియే విక్షేప, లయములని.

విక్షేపమనగా బాహ్యసంబంధమైన వృత్తికి చేరినది. ఇది ప్రవృత్తిమార్గముతో కూడినది. జగత్కారణమైన బాహ్యదృష్టియందు మాత్రమే యీ విక్షేపమనేదివుంటూ వుంటుంది. బాహ్యజగత్తునందు స్థిరత్వముతోకూడిన మనస్సు యెక్కడా కానరాదు. ఇది నిరంతరము చంచలముగానే వుంటూవుంటాది. దీనినే విక్షేపమన్నారు. కదలిక కలిగినది, చంచలమైనది, అస్థిరమైనది, విక్షేపము. ఇది కేవలము స్థూలమైన, ప్రాకృతమైన జగత్తునకు సంబంధించినది. ఇక లయమనగా పూర్తి శూన్యస్థితిలో వుండేది. శూన్యస్థితి అనగా నిద్రావస్థ యందుండేది. నిద్రావస్థయందు మనస్సుయందు సంకల్పవికల్పములు స్తంభించి వుంటాయి. కేవలము అజ్ఞానస్థితిలో అంధకారమై వుంటుంటాయి. విక్షేపము జాగ్రదవస్థ, లయము నిద్రావస్థ. ఈ రెండింటిని అనుసరించటముచేత మానవుడు బంధితుడే అవుతున్నాడు గానీ యిది మోక్షకరము కాలేదు. దినదినమునకును తాను కట్టుబడిపోతున్నాడు. దీనికి మధ్యేమార్గమైనదే ఏకాగ్రత. చంచలత్వమును, శూన్యత్వమును త్యజించి ఏకాగ్రత తత్త్వముతో కొంతవరకు సాధనలు సలిపినప్పుడే యీ నిత్యసత్యమైన ఆత్మతత్త్వము గుర్తించుటకు వీలవుతుంది.

**మానవుడు పాపము, శాసనము, శాస్త్రము, శాపము అనే నాల్గింటికి బద్ధుడై ఉంటాడు**

'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. భగవంతుడు సృష్టించిన ప్రాణికోటిలో మానవుడు ఉత్తముడు, ఉత్కృష్టుడైనవాడు. లోకములో ఉన్నతస్థాయి వుద్యోగమునందున్న వ్యక్తికి బాధ్యతలుకూడను అధికముగానే వుంటాయి. అదేవిధముగనే యీ ప్రాణికోటిలో మానవుడు ఉన్నతస్థాయిలో, ఉత్కృష్టమైన స్థితిలో వుండినవాడు కనుక యితనికే అనేక విధములైన బాధ్యతలుకూడ వుంటుంటాయి. ఈ బాధ్యతలు ఏమిటి? మొదటిది పాపము;

srisathyasaivacharamrutam

రెండవది శాసనము; మూడవది శాస్త్రము; నాల్గవది మానవుడు వూహించలేనిది, శాపము. పాపము, శాసనము, శాస్త్రము, శాపము యీ నాల్గింటికి బద్ధుడై వుంటున్నాడు, మానవుడు.

## నిత్యానిత్య విషయ పరిశీలన చేయగలిగికూడా అహంకారముతో ఆచరించే క్రియలకే పాపమని పేరు

మొట్టమొదటగా పాపము. పాపము మానవునికి మాత్రమే యెందుకు కలదు? మిగిలిన జీవకోటికి యెందుకు లేదు? ఏది మంచిది, ఏది చెడ్డది, ఏది పుణ్యము, ఏది పాపము అని తెలుసుకొనే విచక్షణా జ్ఞానము ఒక్క మానవునికే వున్నది. విచక్షణా జ్ఞానము కలిగిన యీ మానవునకు పాపములు వెంటాడుతూ వుంటాయి. పాపమనగా యేమిటి? ఇది చెడ్డదని తెలిసియు, అది చేయటము పాపము. ఇది దోషము అని తెలిసికూడను చేసే పనికి 'పాపము' అని పేరు. నిత్యానిత్య విషయ పరిశీలనవుండికూడను కేవలము అహంకారముచేతనో లేక అసూయచేతనో ఆచరించే క్రియలకంతా పాపమనే పేరు. అయితే యీ పాపము మనుష్యులయందే ఉంటున్నది. అందునా బాలురకు, జ్ఞానులకు, పిచ్చివారలకు యీ పాపములేవీ అంటవు. కారణమేమనగా, యీ పిల్లలు మరియు పిచ్చివారికి నిత్యానిత్యవిషయ పరిశీలనా శక్తి వుండదు. వీరు కేవలము అమాయకత్వము, అజ్ఞానములతో కూడివుంటారు. అజ్ఞానము, అమాయకత్వముతోకూడిన మనస్సులకు యేమాత్రము పాపము అంటదు. ఇంక జ్ఞానికి పాప, పుణ్యములనేవి సమత్వముగా వుంటాయి. తనకు కావలసినదిగాని, తనదనేదికాని, మమత్వమనేదిగాని అతనికి యేమాత్రము ఉండవు. సర్వే సర్వత్ర జ్ఞాని అద్వైతదర్శనమే చేస్తాడు. దానినే 'అద్వైత దర్శనం జ్ఞానం', అన్నారు. సమత్వముతోకూడిన మనస్సు కలిగినవాడు కనుక జ్ఞానికి పాపము లేమాత్రము అంటవు. స్వార్థ, స్వప్రయోజనములు జ్ఞానియందు యేమాత్రము కనిపించవు. ఏది చేసినా, యేది చూసినా, ఏది చెప్పినా, ఏది సంకల్పించినప్పటికి యిది లోక కళ్యాణనిమిత్తమే కనుక జ్ఞానికి పాపములు అంటవు. మధ్యస్థాయి యందున్న

sri sathyasai vachanamrutam

మానవునికే, దేహభ్రాంతివున్న మానవునికే, మనస్సును విచ్చలవిడిగా విడచిన మానవునికే పాపములు వెన్నాడుతుంటాయి. మనస్సుతో స్వేచ్ఛావిహారము సలిపే మానవునకే ప్రపంచము. ఈ ప్రపంచములో వుండినంతవరకు సుఖదుఃఖములు, లాభనష్టములు తప్పవు. కనుక, మానవుడు పాపములచే కూడినవాడు. నిత్యానిత్య విషయ పరిశీలన చేసి యేది మంచిది, ఏది చెడ్డది, ఏది చేయతగినది, ఏది చేయతగనిది అనే విషయాన్ని విచక్షణా జ్ఞానముతో నిర్ణయించి చేసినప్పుడు పాపములతనిని యే మాత్రము అంటవు.

**శాసనములు మానవులనిమిత్తమై ఏర్పడినవేగాని, పశుపక్ష్యాదులకొరకు కాదు**

ఇంక శాసనము. ప్రపంచములోపల కొన్ని విధములైన న్యాయస్థానములు, న్యాయాధిపతులు వుంటున్నారు. ఇక్కడ దోషములు చేసినవారిని, హింసకు, క్రూర కర్మలకు పాల్పడిన వారిని శిక్షించే స్థానములే యీ ధర్మస్థానములు. అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములలో ప్రవేశించిన మానవునకు కొన్ని విధములైన శిక్షలు విధిస్తున్నాయి. ఈ న్యాయస్థానములు మానవుల నిమిత్తమై ఏర్పడినవి మాత్రమేగాని పశుపక్ష్యమృగాదుల నిమిత్తమై ఏర్పడినవి కాదు. ఒక చిన్న ఉదాహరణము. పశువులో, పందులో ప్రవేశించి, పంటను ధ్వంసముచేసి అనేక నష్టములు కలిగిస్తాయి. పంటను నాశనము చేసినవని, అందుకు నష్ట పరిహారము చెల్లించవలెనని న్యాయ స్థానములు పశువులను, పందులను శాసించవు. తప్పనిసరిగా శిక్షించవలసివస్తే యీ పశువులకు, మృగములకు, పందులకు అధిపతియైన మానవునికే నష్ట పరిహారము చెల్లించాలనే ఆదేశము మరియు శిక్ష యిస్తారుగానీ యీ జంతువులకు కాదు. కనుక యీ శాసనము, న్యాయస్థానములు మానవుల నిమిత్తమే గాని, పశుపక్ష్యాదుల నిమిత్తము కాదని గుర్తించటము అత్యవసరము. నిత్య జీవితములో జరిగే ఒక ఉదాహరణ. కుక్కలు యిండ్లలో ప్రవేశించి కుండలనంతా పగులగొట్టి అందులో వున్న పదార్థములు భుజించి స్వేచ్ఛగా బయటకు వస్తుంటాయి. ఆ కుండలయొక్క పరిహారము, తిండియొక్క పరిహారము చెల్లించవలెనని యే న్యాయ స్థానమైనా ఆదేశము విధించుచున్నదా? అదే మానవుడు పంటను ధ్వంసము చేసినా, కుండలను ధ్వంసము చేసినా, యితనిని దీనియొక్క పరిహారము చెల్లించవలెనని

sri sathyasai vachanamrutam

న్యాయాధిపతులు తీర్పు చెప్పుతూ వుంటారు. ఏతావాతా శాసనములన్నియుకూడను కేవలము మానవుల నిమిత్తమై ఏర్పడినవేగాని పశుపక్ష్యాదుల నిమిత్తము కాదని మానవుడు గుర్తించుకున్నప్పుడు యీ యొక్క ప్రక్రియలను సక్రమమైన రీతిగా అనుభవించటానికి వీలవుతుంది.

**మానవుడు తన జీవితములో నిర్వహించవలసిన విహిత కర్మలను మరియు విసర్జించవలసిన నిషిద్ధ కర్మలను శాస్త్రము నిర్దేశిస్తుంది**

ఇంక మూడవది శాస్త్రము. ఇది బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్త, సన్యాస, యీ చతుర్విధ ఆశ్రమములందు మానవుడు యేరీతిగా ప్రవర్తించాలి అనే విషయాన్ని నిర్దేశిస్తుంది. ఏఏ కార్యకలాపములందు యేయే రీతిగా తాను తనయొక్క కర్తవ్యాన్ని నిర్వర్తించాలి అనే శాసనాన్ని లిఖించినవి. ఇంతే కాకుండా జాతకర్మ, నామకరణ, వివాహమహోత్సవాది కార్యములందుకూడను మానవుడు ఆచరించవలసిన, ఆచరించకూడని విహిత కర్మలు, నిషిద్ధ కర్మలు అనే దానిని శాసిస్తూ వచ్చాయి. లోక కళ్యాణ నిమిత్తమై, మానవునియొక్క జీవిత సంస్కరణ నిమిత్తమై ఆచరించే యజ్ఞయాగాది క్రతువులుకూడను యీ శాస్త్రములలో వివరింపబడినవి. కళ్యాణ సమయమందు వధువు, వరుడు చేయవలసిన ప్రమాణములను చక్కగా శాసించినప్పుడే గృహస్థ ధర్మము చక్కగా నిర్వహింపబడి, సంసారము నిత్యకళ్యాణ పచ్చతోరణములతో కిలకిలలాడుతూ కలకల నవ్వుతూ వుంటుంది. ఇట్టి ప్రమాణములన్నియుకూడను, యిట్టి వాగ్దానములన్నియుకూడను యీనాడు కేవలము మొక్కుబడిగానే జరుగుచున్నవి గాని, హృదయపూర్వకమైన ప్రమాణములుగా విశ్వసింపబడటములేదు. కనుకనే మానవుడు గృహస్థ ధర్మములో అనేకములైన కష్టములకు, దుఃఖములకు, నష్టములకు గురైపోతున్నాడు. అగ్ని సాక్షిగా, హృదయసాక్షిగా అచరించిన వాగ్దానములను ప్రాణ సమానములుగా చూచుకొని ప్రవర్తించినప్పుడే పవిత్రమైన ఫలితముకూడను మనకు లభిస్తుంది.

**జిహ్వే రసజ్ఞే మధురప్రియే త్వమ్ సత్యమ్ హితమ్**

srisathyasaivachanamrutam

**త్వాం పరమం వదామి**

**ఆవరణయేధా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి**

మానవునకు కన్నులు రెండు వుంటున్నవి. వీటితో రెండు పదార్థములు చూడవచ్చు, మానవుడు. రెండు చెవులుంటున్నవి. మంచి, చెడ్డ రెండింటిని వినవచ్చును. కానీ, నాలుక ఒకటే వున్నది. అనగా ఒకే మాటపై నిలవాలి. చెప్పిన మాటకు విరుద్ధముగా నడచినప్పుడు మానవుడు రెండు నాలుకలు కలిగిన విషపురుగుగా తయారవుతాడు. మానవుడు ఏకమాటగా వుండినప్పుడే జీవితములో ఐకమత్యమనేది గాని, ఏకత్వమనేదిగాని సాధ్యపడుతుంది.

'సత్యం వద, ధర్మంచర' అని భారతీయ సంస్కృతియందు ఆదేశింపబడిన రెండు ఆదేశములు పవిత్రమైన మానవుని రెండు నేత్రములవంటివి. సత్యమును చెప్పాలి. ధర్మమును ఆచరించాలి. సత్యము ఒక్కటే గాని, రెండు కాదు. Truth is one not two. ఏకమేవ అద్వితీయం బ్రహ్మ అనే తత్త్వములోకూడను యీ సత్యాన్నే ప్రకటిస్తూ వచ్చింది. సత్యస్వరూపమే దైవము. Truth is GOD అన్నారు. కనుక, యిట్టి సత్యాన్ని, ధర్మాన్ని సక్రమముగా నడచుకోనప్పుడు శాస్త్రము మానవుని అనేక విధములుగా శిక్షిస్తుంది.

**ప్రకృతిలోని శాసనములంతా దైవ నిర్ణయములే!**

నాలుక చేసే పాపములు నాలుగు వుంటున్నాయి. ఒకటి అసత్యము చెప్పటం, రెండవది పరులను దూషించటము, మూడవది, ఇతరులను చులకన చేయుటము, నాల్గవది అతి భాష అనగా ఎక్కువగా మాట్లాడటము. ఈ నాల్గింటి వల్ల నాలుక అనేక విధములైన పాపములకు గురౌతున్నది. అన్నింటియందు సత్యమును సాధ్యమైనంతవరకును ప్రవేశపెట్టి సత్యవాక్పరిపాలన గావించటానికి తగిన కృషి చెయ్యాలి, విద్యార్థులు. కానీ, యీనాటి ఆధునిక యువకులయందు పొద్దున్న ఒక మాట, మధ్యాహ్నము ఒక మాట, రాత్రికి యింకొక మాటగా ఉంటున్నది. 'సతతంయోగినః' అనింది, భగవద్గీత. నిరంతరము సత్యయోగములో మన జీవితము అంకితము గావించాలి. కానీ మనము ఆ విధముగా జీవించటానికి ప్రయత్నించటములేదు. తెల్లవారి యోగము, మధ్యాహ్నము భోగము, రాత్రి

sri sathyasai vachanamrutam

రోగము. యోగ, భోగ, రోగములతోకూడినవాడు సమత్వస్వరూపుడు ఎట్లా అవుతాడు? సమచిత్తుడు ఎట్లా కాగలడు? భూమి తిరగటంచేత ప్రాతఃకాలము, మధ్యాహ్నకాలము, సాయంకాలము అనే వ్యత్యాసములు కలుగుచున్నవేగాని సూర్యునిలో యెట్టి వ్యత్యాసములు కలగటంలేదు. సూర్యుడు భూమధ్యరేఖ పైకి వచ్చినప్పుడు పగలు ప్రారంభమవుతున్నాదని, సూర్యుడు భూమధ్యరేఖకు క్రిందికి పోయినప్పుడు రాత్రి ప్రారంభమైనదని పేర్కొనడం విద్యార్థులకు తెలిసిన విషయమే! ఇక్కడ సూర్యోదయ సూర్యాస్తమయములు యేమాత్రమును లేవు. సూర్యునకు అస్తమయమని లేక ఉదయమని యేమాత్రము భేదము లేదు. భగవత్ శాసనములోపల పవిత్రత, దేశకళ్యాణము, లోకక్షేమాన్ని ఆశించి భగవంతుడు ఎన్నో విధములైన నియమములను సృష్టిస్తూ వచ్చాడు. ఇట్టి భగవత్ సృష్టికి సంబంధించిన యీ ప్రకృతిని మనము యేదో కృత్రిమమైన ఆలోచనచేత అనేక రకములుగా మార్చుటకు ప్రయత్నము చేస్తున్నాము. ఇది దేశమునకే ప్రమాదముగా రూపొందుతుంది. సైన్సు పిల్లలకు బాగా తెలుసును, భూమండలానికి అతి సమీపములో వుండిన గ్రహము చంద్రుడు. 2 లక్షల 45 వేల మైళ్లలో వుంటున్నాడు, యీ చంద్రుడు భూమికి. ఈ చంద్రుడు పౌర్ణిమ దినమున, అమావాస్య దినమున కొన్ని డిగ్రీలు మాత్రమే భూమికి దగ్గరగా వస్తున్నాడు. ఇలాంటి సమయములలోనే సముద్రజలము ఉప్పొంగుతుంది. రాకాసుధాకరుని (చంద్రుని) చూసిన తక్షణమే అనేక అలలతో అంతులేని ఆనందముతో గంతులు వేస్తాడు, సముద్రుడు. నిజముగా ఈ ప్రపంచమునకు ప్రళయమే సంభవించవలెనన్న చంద్రుడు ఏ రెండు మూడు మైళ్ళు దగ్గరకు వచ్చినప్పటికిని చాలు, సముద్రము ఉప్పొంగి ప్రపంచమునంతయు ముంచివేస్తుంది జలముతో. చంద్రుడు ఇప్పుడున్నంత దూరములో ఉండినప్పుడే ఈ భూమండలానికి సుక్షేమము ఉంటుండాది. పంచభూతములు అన్నీకూడను వాటికి నియమించిన స్థాయిలలో, ఆయా స్థానములలో తమయొక్క క్రమమును అనుసరించినప్పుడే ఈ భూమికి క్షేమము ఏర్పడుతుంది. కనుక, ఈ శాసనములంతా కేవలము దైవ నిర్ణయములే అనే సత్యాన్ని గుర్తించి ఈ శాసనమును మనము పాటించడానికి ప్రయత్నించినప్పుడే 'యోగ క్షేమం వహామ్యహం' అనే సత్యాన్ని అనుభవించవచ్చు.

sri sathyasai vachanamrutam

**తప్పుకు తగిన శిక్ష విధించబడినప్పుడే మనిషి సక్రమమైన మార్గములో నడచుటకు వీలవుతుంది**

ఇంక నాల్గవది శాపము. ఎవరు శాపమిచ్చేవారు? మహర్షులు, మహనీయులు, యోగులు ఇలాంటివారు శాపానికి కారకు లవుతున్నారని మీరనుకోవచ్చు. ఎలాంటి సమయములో మనకు శాపములు తగులుతున్నాయి? మహర్షులను హింసించినప్పుడు, మహర్షులకు బాధలు కలిగించినప్పుడు, వారి మనస్సుకు భిన్నమైన మార్గాన్ని అవలంభించినప్పుడు, వారు గావించే లోక కల్యాణమునకు అడ్డు తగిలినప్పుడు, మహర్షులు కఠినమైన వాక్కును ఉపయోగిస్తారు. కాని, మహర్షులు శపిస్తున్నారని, అది వీరికి తగిన పని కాదని, మహర్షులనుకూడ విమర్శించే వ్యక్తులు ఈ లోకములో లేకపోలేదు. అయితే, ఏ శిక్షయైనా ఈ పాంచ భౌతిక శరీరమునకు రక్షగానే రూపొందుతుంది. తప్పుకు తగిన శిక్ష విధించినప్పుడే మనిషి సక్రమమైన మార్గములో ప్రవేశించుటకు వీలవుతుంది. తప్పును క్షమించుకుంటూ పోవటంచేత తప్పులు మరింత అధికమవుతూ ఉంటాయి. అంతేకాకుండా, ఏది తప్పో ఏది ఒప్పో తెలుసుకోలేక విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతుంటారు. అప్పుడు ఇలాంటి జాగ్రత్తను కల్పించటముకూడను శాసనములో ఉన్న అంగమే.

ఒకనాడు పరీక్షిత్ మహారాజు అరణ్యములో ప్రవేశించి వేటాడి అలసిపోయి ఒక ఆశ్రమము చేరుకున్నాడు. మహారాజుకు విశాల హృదయము ఉండాలి. రాజ్య ప్రజలందరినీ తన బిడ్డలుగా విశ్వసించాలి. మహర్షులను తనకు మార్గదర్శకులుగా ఎన్నుకోవాలి. సర్వశాస్త్రములు, సర్వనియమములు గుర్తించినవారు మహనీయులు. కనుక, వారి అజ్ఞానుసారమే వర్తించాలి. ఆవిధముగా ప్రవర్తించవలసిన మహారాజు ఆశ్రమములో ప్రవేశించి తన దాహమునకు తగిన ఉపశాంతిని అందించలేదని కోపముచేత మరణించిన సర్పమును తెచ్చి ధ్యానములో వుండిన మహర్షి మెడలో చుట్టి వచ్చాడు. ఇది మహారాజు చేయవలసిన పనికాదు. కనుకనే యీ దృశ్యమును చూచి ఆ మహర్షి కుమారుడైన శృంగి శపించాడు. 'ఏడు దినములలోపల నీవు సర్పము కాటుకు గురయి మరణింతువు గాక!'

అని. అయితే, పరీక్షిత్తు మహారాజు తన దోషమును గుర్తించుకున్నవాడు కనుక యీ ఏడు దినములలోపల నిరంతరము క్షణమైనాకూడను వ్యర్థముచేయక భాగవత కథా శ్రవణంచేత తన శేషజీవితాన్ని సార్థకము గావించుకోవాలని సంకల్పించుకున్నాడు.

ఏనాడు మానవునియందు సత్సంకల్పము ఆవిర్భవిస్తుందో ఆనాడే సర్వక్షేమములుకూడా వచ్చి చేరిపోతాయి. వేలాదిమంది మహర్షులు వచ్చి మహారాజు వద్ద చేరిపోయారు. ఆ సమయమునకు శుక మహర్షికూడను అక్కడకు చేరాడు. ఒక పవిత్రమైన పరిస్థితియందే వీరి కూటమి ఏర్పడుతుంది. ఈ శుక మహర్షి బోధించిన భాగవతముయొక్క తత్వాన్ని మహర్షులు వినటమే కాక పరీక్షన్మహారాజు యేకోన్ముఖచిత్తుడై, ఏకాగ్రతతో కంటివెంట ఆనందబాష్పములు రాలుచుండగా ఆలకించి చివరకు ఏడవరోజున తన జీవితమును అంత్యము గావించుకున్నాడు. ప్రాణము వదిలే పూర్వము పరీక్షన్మహారాజు చెప్పాడు, ‘ ఓ శృంగి మహానుభావా! నీవిచ్చినది శాపముకాదు. గొప్ప వరప్రసాదము’ అన్నాడు. కనుక మహర్షుల కఠినమైన వాక్యములుకూడను మానవులకు కళ్యాణ కరములైనవేగాని దానిని వారు గుర్తించటము లేదు. కేవలము వాక్యమును మాత్రమే ఒక శాపముగా భావించి మహర్షులను దూషించటానికి ప్రయత్నిస్తుంటారు. నిజముగా ఆ శాపమే లేకుండిన పరీక్షన్మహారాజు అంత్యమునందు యీ విధంగా పవిత్రమైన కాలాన్ని గడిపేవాడుకాదు.

ఇంక అగస్త్యమహర్షికూడను దేవేంద్రుని ‘నీవు గజమై జీవింతువుగాక’ అని శపించాడు. ఆ గజమే తన దేహబలము, బుద్ధిబలము, భుజబలము విశ్వసించి తాను మకరితో పోరాడటానికి ప్రయత్నం చేసింది. కట్టకడపటికి తనయొక్క బలహీనతను గుర్తించి, ‘దేహబలము దుర్బలము, దైవబలమే నిజబలము’ అనే సత్యాన్ని గుర్తించి, ‘రావే ఈశ్వర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా’, అని మొరపెట్టుకుంది. అహంకారముతో వుండినంతవరకు మానవునకుగానీ, మృగములకుగానీ విజ్ఞానము తనలో ఆవిర్భవించదు. యీ గజరాజుకూడా అహంకారముతో వుండినంతవరకు అనేక విధములైన కష్టములకు గురి అయ్యింది. ‘ప్రాణంబుల్ ఠావుల్ తప్పెన్, మూర్ఛ వచ్చె, తనువున్ డస్సెన్,



srisathyasaivachanamrutam

శ్రమంబయ్యెడిన్', అని తన దేహము శమించి పోయింది. మనస్సుయొక్క విజ్ఞానము పూర్తిగా మారిపోయింది. జీవితమనేది దుర్భరమైన జీవితముగా రూపొందింది. అట్టి సమయములందే దైవము జ్ఞాపకము వస్తాడు.

**రెండు బాధల మధ్యలోనే మానవునకు సంతోషము లభిస్తుంది**

కష్టములే లేకుండిన సుఖములు యెవ్వరుకూడను ఆశించరు. కష్టములే సుఖాన్ని అందిస్తున్నాయి. Pleasure is an interval between two pains. రెండు బాధలమధ్యలోపలనే మానవునకు సంతోషము లభిస్తుంది. తెలుగులోకూడను అనేకమంది వాడుతూ వుంటారు, యీ పదములు, "సంకటము వస్తే వెంకటరమణా!" అని. అంతకు పూర్వము వెంకటరమణ పేరు యేమాత్రము స్మరించరు. సంకటమే ప్రారంభమవుతే అప్పుడు 'వెంకటరమణా!' అని రోదిస్తారు. కనుక, కష్టసమయమునందు దుఃఖసమయములందు, విచారసమయములందు, బాధలసమయములందు భగవంతుని ఆశించినట్టుగా మరొక సమయములో ఆశించరు. తనయొక్క సమస్యలు తీర్చే నిమిత్తము భగవంతుని అనుగ్రహము అత్యవసరము. సీటుకావాలి అనేటప్పుడు ప్రార్థించే ప్రార్థనలు సీటు చిక్కిన తరువాత వుండవు. మానవునియొక్క మనస్సు ఇటువంటి వికల్పములతోకూడినది. ఒక్కొక్కప్పుడు శాపములుకూడను మానవునికి వరప్రసాదముగానే రూపొందుతాయి. నిజముగా ఆ శాపమే లేకుండిన గజరాజు తన దృష్టిని భగవంతునిపైన మరల్చేవాడు కాదు. మనదృష్టి యెట్టిదో సృష్టి అట్టిది. మన భావము యెట్టిదో, ఫలితమట్టిది. పిండి యెట్టిదో రొట్టె అట్టిది. తిండి యెట్టిదో త్రేపు అట్టిది. అంతేకాని, సృష్టి నిర్ణయాల్లో ఎట్టి మార్పులు, భేదములు కలుగుటకు వీలుకాదు. కనుక, మనము మంచిని చేసి మంచిని అనుభవించాలి. చెడ్డను చేసి మంచిని అనుభవించాలంటే యిది సాధ్యమయేదికాదు. చేదుకాయలు భుజించి మంచి మామిడి పండ్లవాసన రావాలంటే వస్తుందా? మనము యేది చేస్తామో దానియొక్క రిజల్టుకు సిద్ధముగా వుంటుండాలి. కనుక, దోషములు చేసే వున్నతస్థాయిలో వుండిన వ్యక్తులను దోషరహితులను గావించాలనే వుద్దేశ్యముతో మహనీయులు సంకల్పించుకున్న వాక్యములే శాపము రూపములో వస్తాయి.

sri sathyasai vachanamrutam

అంతేగాని, నిజముగా హృదయపూర్వకముగా ఎవరిని శిక్షించాలని మహర్షుల అభిమతము కాదు.

ఒకానొక సమయములో పీఠాధిపతులకుకూడా కొన్ని నియమములు ఏర్పరుస్తూ వచ్చారు. పదకొండవ శంకరాచార్యులుగా వుండిన ఉదయభాస్కర్‌కు తాను ధ్యాననిష్ఠలో వుండిన సమయములో తన ద్వారముముందు సిపాయి దండును పెట్టుకొని "తస్మాత్ జాగ్రత; జాగ్రత, తస్మాత్ జాగ్రత జాగ్రత.." అని క్షణక్షణమునకు తనను హెచ్చరించే నియమమును ఏర్పాటుచేశారు. ఒకనాడు యీ పదకొండవ శంకరాచార్యులు ధ్యానమునందు కూర్చొని 'అహా! ఎంత పెద్ద Property! దీనికి నేను పీఠాధిపతి అయిపోయినాను, నా శిష్యులు ఎంతమంది;' అని స్మరించుకుంటూ వచ్చాడు. ఇది క్రమేణా అహంకార మార్గములో ప్రవేశింప జేసే సమయములో 'తస్మాత్ జాగ్రత జాగ్రత', అని ద్వారమువద్ద కాపలా కాసే సిపాయిల హెచ్చరిక ఆయన హృదయములో హత్తుకున్నాది. తక్షణమే 'ఛీ! నాకు యీ భావములు వుండవలసినది కాదు,' అని తనను తాను సరి చేసుకున్నాడు. అదే సమయములో ఒక శిష్యుడు వెనుక భాగమునుండి

**మాతానాస్తి పితానాస్తి నాస్తి బంధు సహోదరః**
**అర్థం నాస్తి గృహంనాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత**

అన్నాడు. మరొక శిష్యుడు

**జన్మదుఃఖమ్, జరాదుఃఖమ్, జన్మదుఃఖమ్ పునఃపునః**
**అంత్యకాలే మహా దుఃఖమ్ తస్మాత్ జాగ్రత జాగ్రత**

అన్నాడు. యిలాంటి హెచ్చరికలు మానవుని మనస్సును సక్రమమైన మార్గములోనికి మరల్చుటానికి యేర్పడినవనే సత్యాన్ని మనము చక్కగా గుర్తించాలి. ఈ పవిత్రమైన మార్గములే భగవంతుని సన్నిధి చేర్చే పెన్నిధి. ఇలాంటి ఉత్తమ మార్గములు మనము అవలంభించినప్పుడే వున్నత స్థాయిని మనము పొందగలము.

పాపము, శాసనము, శాస్త్రము, శాపము యీ నాలుగు ఎట్టివారికైనా అవసరమే! 'రోగము నివారణగావించుకోవాలి', అని ఆశించే మానవునికే ఔషధము మరియు పథ్యము.

srisathyasaivachanamrutam

అదే విధముగనే భవ బంధములనుంచి దూరముకావాలని ఆశించే మానవునికే యీ నాలుగు అత్యవసరము. భవ బంధనలోనే వుండి సంసారమనే మురికి కూపమునందే మునిగి నా అవస్థ ఏమైనా అయిపోనీ అని భావించే మానవునికి యే పాపములు లేవు, ఏ శాస్త్రము లేదు, ఏ శాసనము లేదు, ఏ శాపము లేదు. తనయొక్క మాటలే తనకు శాపము. ఏతావాతా మనస్సుయొక్క ప్రభావమంతయుకూడను కేవలము యీ స్థూల సూక్ష్మ స్వరూపములపైన ఆధారపడి వుండటముచేతనే మానవుడు యిన్ని విధములైన కష్టములకు గురౌతున్నాడు.

## దేహము ఇరువది నాలుగు తత్త్వములతో కూడినది

దేహము ఇరువది నాలుగు తత్త్వములతో కూడి వుంటున్నాది. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు ప్రాణములు, ఐదు కోశములు, మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము, యీ యిరువది నాలుగు తత్త్వములతో కూడినదే దేహము. కనుకనే, మహాబాధ్యత గలిగినది యీ దేహము. ఇంక సూక్ష్మమైన మనస్సు పదునాలుగు తత్త్వములతోకూడినవి. దీనికి కర్మేంద్రియములేమాత్రము లేవు. దీనికి పంచకోశములు యేమాత్రము లేవు. 'సంకల్పములమయమే మనస్సుయొక్క స్వరూపము', అన్నారు. ఇక కారణదేహమందు కేవలము వాసనలు మాత్రమే వుంటున్నాయి. ఇక్కడ రెండు మాత్రమే వుంటున్నాయి. మనస్సు, బుద్ధి మాత్రమే వుంటున్నాయి. కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, పంచకోశములు, పంచప్రాణములు, మనస్సు, యివంతా మేమాత్రము లేవు. ఈ బుద్ధియొక్క తత్త్వముతో మైండ్ ఏకమైపోయింది. ఇంక మహా కారణస్వరూపమైనది కేవలము నిర్మలముగా, నిశ్చలముగా, 'నిర్గుణం, నిరంజనం, నికేతనం, సనాతనం నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం'. దీనికి ఏ మాత్రము గుణములు లేవు. ఏ విధమైన చైతన్యము లేదు. సర్వత్ర వ్యాపించినది. అదే ఆత్మతత్త్వము. అదే పరబ్రహ్మ తత్త్వము. అదే పరమాత్మ తత్త్వము. దీనిని యే పేరుతోనైనా పిలవవచ్చు.

## మనస్సును అరికట్టుకునే మార్గమునకే ధ్యానమని పేరు

దేహము స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ స్వరూపములుగా రూపొందుతూ

వచ్చింది. స్థూలము యింద్రియములతోకూడినది మాత్రమే. సూక్ష్మము సంకల్పములతోకూడినది మాత్రమే. కారణము వాసనలతోకూడినది మాత్రమే. సర్వరహితమైన నిర్మల స్వరూపమే మహాకారణము. క్రమక్రమేణా యీ గుణములు తగ్గిపోతున్నాయి. యిరువది నాలుగునుండి, పదనాలుగుకు వచ్చాయి. పదునాలుగునుండి రెండుకు వచ్చాయి. రెండునుండి జీరోకు వచ్చాయి. ఇంద్రియములు, భావములు (మనస్సు) అధికమయ్యేకొలది మనకు బంధన అధిక మవుతూ వస్తుంది. అందుకోసమే యీ మనస్సును అరికట్టుకొనే మార్గమునకే 'ధ్యానము' అని పేరు పెట్టారు. అనగా సంకల్పములు పెంచుకొనకుండా ధ్యానములో యేకాగ్రత గావించుకొన్నప్పుడు యీ సంకల్పవికల్పకాత్మకమైన మనస్సు దైవత్వముతో ఏకమైపోతుంది. సంకల్పములు అధికమయ్యేకొలది మానవునకు కేవలము దుఃఖమే తప్ప యేమాత్రము ఆనందము లభించదు. లోకములో గాలికి మహావేగమన్నారు. కాని దానికంటే ఎన్నో కోట్ల రెట్లు వేగమైనది యీ మనస్సు. ఒక్క క్షణములో ముల్లోకాలను చుట్టి వస్తుంది. మహాశక్తివంతమైనది. ఏది ముందు పోతుందో దానికంటే ముందుగానే పోయి మైందు వుంటుంటాది. కనుక, యిట్టి మనస్సును మనము అరికట్టాలనుకుంటే ఒకే ఒక్క మార్గము ఉన్నది. దీనినే హడ్డింగ్‌టన్ అనే బ్రిటీషు సైంటిస్టు అన్ని విధాలా పరిశోధనలు సలిపి కట్టకడపటికి తన డైరీలో ఒక వాక్యము రాసాడు, 'Universe is a thought of GOD'. అనగా 'యీ ప్రపంచము అంతా భగవంతునియొక్క సంకల్పము. ఆ సంకల్పమునుంచే సృష్టి అంతా వచ్చింది. దీనిని తెలుసుకోటము యెవ్వరితరము కాద'న్నాడు. 'మనము తెలుసుకోటానికి ప్రయత్నిస్తున్నాము, మనయొక్క మూర్ఖబుద్ధితో. దీనిని ఎవరు సృష్టించారో ఆయనకు తప్ప అన్యులకిది గోచరము కాదు', అని పూర్తి నిర్ణయము చేసుకున్నాడు ఆ సైంటిస్టు. హరి లీలలు హరికే తెలుసు. యిట్టి సత్యాన్ని మానవుడు గుర్తించినప్పుడే తన వక్ర బుద్ధులను కొంతవరకును అదుపులో పెట్టుకోటానికి సాధ్యమవుతుంది. అహంకారమనేది వుండినంతవరకు ఏ మానవుడైనా ఏ మాత్రము ఆనందాన్ని అనుభవించలేడు. లోకములో అన్ని పదార్థములను సాధించవచ్చును. తాత్కాలికముగా ఆ పదార్థము మనకు సంయోగమైనప్పుడు మహా సంతోషాన్ని అనుభవిస్తాము. అయితే, సంయోగమునకు,

sri sathyasai vacharamrutam

వియోగము తప్పినదికాదు. వియోగముచేత మనము బాధలు పొందుతాము. అది లభించిన తక్షణమే మనము కొంత ఆనందాన్ని అనుభవిస్తాము. తిరిగి ఆ సంపాదించినది పోయేటప్పటికి బాధను పొందుతాము. సంపాదించుటకు పూర్వము దుఃఖమే! అది గతించిన తరువాత తిరిగి దుఃఖమే! సంతోషమెక్కడ వుంది? రెండు దుఃఖములకుమధ్య మాత్రమే వుంటున్నాది.

ఈ జగత్తంతా ఎప్పుడు పుట్టింది? ఇది పుట్టింది అంటే పుట్టిన దానికి గిట్టడం అనేది వుంటుందికదా! కనుక, పుట్టటానికి పూర్వము జగత్తు లేదు. తిరిగి గతించిన తరువాత యీ జగత్తు మనకు లేదు. ఈ పుట్టటానికి, గిట్టటానికి మధ్యలో వచ్చి చేరినదే యీ జగత్తు. ఈ సత్యాన్ని మానసికముగా మనము గుర్తించినప్పుడే మాధవత్వాన్ని మనము పొందగలము. 'మనసంటే మాధవుడే! మాధవుడంటే మానవుడే! మానవుడంటే మనస్సే!' యీ మూడింటి యేకత్వాన్ని మనము గుర్తించినప్పుడే సమత్వమనేది ప్రాప్తిస్తుంది. అప్పుడే దివ్యత్వాన్ని చేరిపోతాము. యీ సమత్వాన్ని పొందటానికి మనము నిర్మలత్వాన్ని చేర్చుకోవాలి. నిర్మలత్వము కావాలంటే సమైక్యతను పొందాలి. కనుక యీ unity ని మనము అభివృద్ధి పరచుకున్నప్పుడే Divinity. ఈ సమత్వముచేత మనకు purity. Purity చేత unity. Unity చేత Divinity. ఇదే మనయొక్క మార్గము. అన్నింటియందును మనస్సు సమత్వముగా చేసుకోవాలి. అన్నింటికి మనము ప్రేమ తత్త్వాన్ని పెంచుకోవాలి. అదే దైవము. Love is GOD. Live in LOVE.

**(తేదీ 11-09-1986న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam